నమస్తే తెలంగాణ
# సూర్యాపేట
5 | ఖమ్మం, సోమవారం 16 జూన్ 2025 | SURYAPET

## రాజకీయ కక్షతోనే కేటీఆర్‌కు నోటీసులు


మాట్లాడుతున్న మాజీఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

నార్కట్‌పల్లి జూన్ 15: అక్రమ కేసులు, అడ్డగోలు నోటీసులతో ప్రజల పక్షాన బీఆర్ఎస్ పార్టీ చేస్తున్న పోరాటాలను ఆపలేరని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. ఆదివారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాజకీయ కక్షతోనే కేటీఆర్‌కు నోటీసులు ఇచ్చారన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ముచ్చెమటలు పట్టించడమే కేటీఆర్ చేసిన నేరమని, అందుకే అక్రమ కేసులతో నోటీసులు ఇస్తున్నారని ఆయన మండిపడ్డారు. నోటీసులతో అడ్డంకులు సృష్టించి, చిల్లర వేషాలు వేస్తున్నారని పేర్కొన్నారు. కేసులు, జైళ్లు, విచారణలు బీఆర్ఎస్‌ను ఆపలేవని, కాంగ్రెస్ ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసులో రేపు విచారణకు హాజరవుతున్న కేటీఆర్‌కు మద్దతుగా నిలుస్తామని తెలిపారు. కార్యక్రమంలో యానాల అశోక్ రెడ్డి, మేకల రాజిరెడ్డి, వాజిద్ ఉన్నారు.

## లోక్ అదాలత్‌లో 16,460 కేసులు పరిష్కారం

- నల్లగొండ ఎస్పీ శరత్‌చంద్రపవార్



నీలగిరి, జూన్ 15: జాతీయ మెగా లోక్‌అదాలత్‌లో 16,460 కేసులు పరిష్కరించినట్లు నల్లగొండ ఎస్పీ శరత్‌చంద్రపవార్ ఆదివారం ప్రకటనలో తెలిపారు. జిల్లా పరిధిలోని వివిధ పోలీసు స్టేషన్లలో నమోదైన అండర్ ఇన్వెస్టిగేషన్, కోర్టు విచారణలో ఉన్న ఐపీసీ కేసులు 706, డ్రంక్ అండ్ డ్రైవ్, ఎంవీ యాక్ట్ కేసులు 4,695, ఈ పిట్టి కేసులు 11,026, సైబర్ క్రైమ్ కేసులు 33 పరిష్కరించామన్నారు. శనివారం జరిగిన జాతీయ లోక్ అదాలత్‌లో వివిధ రాజీ పడదగిన కేసుల్లో తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవా షెడ్యూల్ ప్రకారం రాజీ మార్గాన కేసులను పరిష్కరించడానికి కృషి చేశామన్నారు. కేసుల పరిష్కారంలో చక్కగా వ్యవహరించిన పోలీసు అధికారులు, సిబ్బంది, కోర్టు కానిస్టేబుళ్లను ఎస్పీ శరత్‌చంద్రపవార్ అభినందించారు.

## మెడికల్ కాలేజీని తరలించే ప్రయత్నం మానుకోవాలి


వలిగొండ పోలీస్ స్టేషన్ ఎదుట కర్రె వెంకటయ్యతో కలిసి నిరసన తెలుపుతున్న ఆలేరు ఎమ్మెల్యే గొంగడి సునీతా మహేందర్‌రెడ్డి

వలిగొండ, జూన్ 15: మల్లాపూర్ నుంచి మెడికల్ కళాశాలను తరలించే ప్రయత్నాలను ప్రభుత్వం మానుకోవాలని ఆలేరు మాజీ ఎమ్మెల్యే గొంగడి సునీతామహేందర్‌రెడ్డి ప్రభుత్వాన్ని హెచ్చరించారు. మెడికల్ కళాశాల కోసం గ్రామంలో ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న కర్రె వెంకటయ్యను అరెస్టు చేసి వలిగొండ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా గొంగడి సునీతా మహేందర్‌రెడ్డి బీఆర్ఎస్ శ్రేణులతో తరలివచ్చి అక్రమంగా అరెస్టు చేసిన కర్రె వెంకటయ్యను బేషరతుగా విడుదల చేయాలని, మెడికల్ కళాశాలను మల్లాపూర్‌లోనే నిర్మిస్తామని కలెక్టర్, వైద్యాధికారి, వైద్యారోగ్యశాఖ కార్యదర్శి హామీ ఇచ్చేంత వరకు పోలీస్ స్టేషన్ నుంచి వెళ్లేది లేదని బీష్మించుకూర్చున్నారు. సమాచారం తెలుసుకున్న యాదగిరిగుట్ట ఏసీపీ శ్రీనివాస్‌నాయుడు వలిగొండ పోలీస్ స్టేషన్‌కు చేరుకొని నిరసన తెలుపుతున్న వారితో చర్చించి శాంతి భద్రతల చర్యలో భాగంగానే కర్రె వెంకటయ్య వలిగొండకు తరలించామని తెలిపారు. కార్యక్రమంలో వలిగొండ మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు తుమ్మల వెంకట్‌రెడ్డి, పనుమటి మమతానరేందర్‌రెడ్డి, బాపట్ల నరహరి, ముక్కర్ల సతీష్‌యాదవ్, ఆవుల సాయియాదవ్, భిక్షపతి, గుండ్లపల్లి వెంకటేశ్, మహేశ్, సుదాగాని శ్రీకాంత్, బాబురావు, గోపి, ఎల్లయ్య, ఎండీ అఫ్రోజ్, బల్గూరి నరేష్‌రెడ్డి, మోతె మల్లేశం, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరు

రామన్నపేట, జూన్ 15: అక్రమ అరెస్టులతో ప్రజా ఉద్యమాలను ఆపలేరని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పోశబోయిన మల్లేశం అన్నారు. ఆదివారం యాదగిరిగుట్ట మండలంలోని మల్లాపురంలో బీఆర్ఎస్ హయాంలో మంజూరైన ప్రభుత్వ వైద్య కళాశాలను గ్రామంలోనే నెలకొల్పాలని కోరుతూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన ఆమరణ నిరాహార దీక్షను పోలీసులు భగ్నం చేసి నాయకులను అరెస్టు చేసి రామన్నపేట పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చారు. విషయం తెసులున్న స్థానిక నాయకులు వారిని కలిసి సంఘీభావం తెలిపారు. సంఘీభావం తెలిపిన వారిలో కంభంపాటి శ్రీనివాస్, సాల్వేరు అశోక్, చాంద్, ఆమేర్, వంగాల యాదయ్య ఉన్నారు.


అరెస్టు అయిన నాయకులకు సంఘీభావం తెలుపుతున్న రామన్నపేట బీఆర్ఎస్ నాయకులు

## గుండాలలో బీఆర్ఎస్ ధర్నా

గుండాల, 15: యాదగిరిగుట్ట బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కర్రె వెంకటయ్య అరెస్టుకు నిరసనగా ఆదివారం గుండాలలో ఆ పార్టీ నాయకులు ధర్నాకు దిగారు. మల్లాపురంలోనే ప్రభుత్వ మెడికల్ కళాశాల నిర్మించాలని డిమాం డ్ చేస్తూ కర్రె వెంకటయ్య ఆమరణ నిరాహార దీక్షకు దిగడంతో పోలీసులు ఆయనను అరెస్టు చేశారు. ఈ నేపథ్యంలో వెంకటయ్యను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ గుండాలలో బీఆర్ఎస్ నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకుడు మద్దుల బాల్‌రెడ్డి మాట్లాడుతూ శాంతియుతంగా ఆమరణ దీక్షకు దిగిన కర్రె వెంకటయ్యను పోలీసులు అరెస్టు చేయడం హేయమైన చర్య అన్నారు. మెడికల్ కళాశాల నిర్మించే స్థలాన్ని మార్పు చేయడం తగదన్నారు. కర్రె వెంకటయ్యను తక్షణమే విడుదల చేయాలని డిమండ్ చేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి సభ్యులు సంగి బాలకొమురయ్య, రైతు సంఘం నాయకులు చెన్నారెడ్డి, యువజన, విద్యార్థి విభాగాల మండల అధ్యక్షులు అట్ల రంజిత్‌రెడ్డి, కొమ్మగళ్ళ దయాకర్, నాయకులు గడ్డమీది మహోదయ్, అన్నెపర్తి భిక్షం, నాగెల్లి రమేశ్, కిష్టయ్య, నాగబండి నవీన్, రాజురెడ్డి, వెలిమినేటి నాగరాజు, ఎనగందుల నాగరాజు, లింగస్వామి, పరుషరాములు, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.


గుండాల మండల కేంద్రంలో ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు


యాదగిరిగుట్ట: మల్లాపురంలో కర్రె వెంకటయ్యను లాగుతున్న సీఐ భాస్కర్


మల్లాపురంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కర్రె వెంకటయ్యను ఎత్తుకెళ్తున్న యాదగిరిగుట్ట పట్టణ సీఐ భాస్కర్

# అట్టుడికిన మల్లాపురం..!

### గ్రామంలో ప్రభుత్వ వైద్య కళాశాల ఏర్పాటు చేయాలని డిమాండ్

### ఆమరణ నిరాహార దీక్షకు దిగిన బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కర్రె వెంకటయ్య

**దీక్షపై ఏసీపీ ఆధ్వర్యంలో 70 మంది పోలీసుల దాడి**

- బీఆర్ఎస్ నాయకులను బలవంతంగా వాహనాలు ఎక్కించిన పోలీసులు
- పోలీసులను నిలదీసిన గ్రామ మహిళలు
- బీర్ల అయిలయ్యపై గ్రామస్తుల ఆగ్రహం
- ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య బాధ్యత వహించాలి: మాజీ ప్రభుత్వ విప్ గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి


యాదగిరిగుట్ట: మల్లాపురంలో నిరాహారదీక్షలో పాల్గొన్న బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కర్రె వెంకటయ్య

యాదగిరిగుట్ట, జూన్15: ఏసీపీ, ముగ్గురు సీఐలు, ఎస్సైలు, కానిస్టేబుళ్లు, మహిళా కానిస్టేబుళ్లు, స్పెషల్ టీం, ఎస్‌వోటీలు వెరసి 70 మంది పోలీసులు, నాలుగు పోలీసు వాహనాలు, రెండు డీసీఎంలతో ఆదివారం మల్లాపురం అట్టుడికింది. ఎలాంటి ముందస్తు హెచ్చరికలు లేకుండా పోలీసులు దీక్ష భగ్నం చేసేందుకు ముకుమ్మడిగా దాడి చేసి ఆమరణ నిరాహార దీక్షలో పాల్గొన్న బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కర్రె వెంకటయ్యతోపాటు మరో 30 మంది నాయకులను బలంతంగా వాహనాల్లో ఎక్కించారు. ముందస్తు ఎందుకు మాపై దాడికి పాల్పడుతున్నారని అడిగేందువచ్చిన బీఆర్ఎస్ కార్యకర్తలపై ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ భయానక వాతావరణాన్ని సృష్టించారు. అక్కడి దీక్ష పాల్గొన్న నేతలకు వార్నింగ్‌లు ఇవ్వడంతో యుద్ధ వాతావరణం నెలకొన్నది. అడ్డం వచ్చిన మహిళలను సైతం మహిళాపోలీసులతో అడ్డుకున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మంజూరైన ప్రభుత్వ వైద్యకళాశాలను మల్లాపురంలోనే నెలకొల్పాలని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కర్రె వెంకటయ్య ఆమరణ నిరాహార దీక్ష చేపట్టారు. ఆదివారం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఉదయం సుమారు 500 మంది మహిళలు, పీఏసీఎస్ చైర్మన్ ఇమ్మడి రామిరెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గడ్డమీది రవీందర్ గౌడ్, మాజీ జడ్పీటీసీ తోటకూరి అనురాధ పాల్గొని దీక్షకు మద్దతు పలికారు. మహిళలంతా భోజనానికి వెళ్లి తిరుగువద్దామనుకుంటున్న సమయంలోనే అదును చూసి హుటాహుటిన ఏసీపీ శ్రీనివాస్ నాయుడు ఆధ్వర్యంలో సీఐలు భాస్కర్, శంకర్‌గౌడ్, కొండల్‌రావు, ఎస్సై ఉదయ్‌తోపాటు సుమారుగా 70 మంది పోలీస్ కానిస్టేబుళ్లు, మహిళా పోలీసులు మూకుమ్మడిగా దీక్ష శిబిరంపైకి దూసుకువచ్చారు. అక్కడ ఆమరణ నిరాహార దీక్షలో ఉన్న కర్రె వెంకటయ్యతోపాటు, బీఆర్ఎస్‌కేవీ నాయకులు బరిగే నర్సింహులు, ఒగ్గు మల్లేశ్‌తోపాటు మాజీ ఉప సర్పంచ్ పల్లెపాటి మాధవులను బలవంతంగా లాక్కెళ్లి డీసీఎంలో ఎక్కించారు.

### పోలీసులను నిలదీసిన మహిళలు

మా గ్రామానికి వైద్య కళాశాల కావాలని ప్రజాస్వామ్యబద్ధంగా దీక్ష చేస్తుంటే ఎందుకు అరెస్టు చేస్తున్నారని పోలీసులను మహిళలు నిలదీశారు. మల్లాపురంలోనే ప్రభుత్వ వైద్య కళాశాలను ఏర్పాటు చేయాలని చెబుతూ బీఆర్ఎస్ నాయకుడు కర్రె వెంకటయ్య చేపట్టిన నిరాహార దీక్షపై పోలీసుల అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారని, రౌడీల్లా వ్యవహరిస్తున్నారంటూ నిప్పులు చెరిగారు. బీఆర్ఎస్ పాలనలో ఇలాంటి ఘటనలు లేవని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాతే పోలీసులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని మహిళలు ఫైర్ అయ్యారు. ఏసీపీ శ్రీనివాస్ నాయుడిని నిలదీశారు. పోలీసులను గ్రామానికి ఎవరు పంపారో చెప్పాలన్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే బీర్ల అయిలయ్యకు ఓట్లు వేస్తే ఇలా చేస్తారా అని మండిపడ్డారు. మా గ్రామంలో వైద్య కళాశాల ఏర్పాటు చేయాలని దీక్ష చేస్తుంటే మీకేం పని అంటూ గ్రామస్తులందరినీ అరెస్టు చేసి తీసుకుపోండంటూ వారిని అడ్డుకునే ప్రయత్నం చేశారు. నాయకులను అరెస్టు చేసి తరలిస్తున్న వాహనాలను అడ్డుకున్నారు. ఎట్టిపరిస్థితుల్లో వాళ్లను వదిలిపెట్టాలని డిమాండ్ చేస్తూ రోడ్డుపై బైఠాయించారు.

### బీర్ల అయిలయ్యపై గ్రామస్తులు ఫైర్

మల్లాపురంలో ఎమ్మెల్యే బీర్ల అయిలయ్యపై మహిళలు ఫైర్ అయ్యారు. అమ్మమ్మ గ్రామమైన మల్లాపురంలో అభివృద్ధి చేస్తానని చెప్పిన ఎమ్మెల్యే అయిలయ్య పోలీసులతో అభివృద్ధిని అడ్డుకుంటున్నారని మండిపడ్డారు. ఎందుకు ఓటేశామా అని బాధపడుతున్నామన్నారు. ఇంతమంది పోలీసులను గ్రామానికి పంపి దీక్షను భగ్నం చేయాల్సిన అవసరమేమొచ్చిందని ఎమ్మెల్యేను ప్రశ్నించారు. ఎట్టి పరిస్థితుల్లో మల్లాపురంలో వైద్యకళాశాల వచ్చే వరకు ఊరుకునేది లేదని హెచ్చరించారు. గ్రామంలో ప్రతి ఆడపడుచు కర్రె వెంకటయ్యకు మద్దతుగా నిలుస్తామని చెప్పారు.

### పూర్తి బాధ్యత ఎమ్మెల్యే బీర్ల అయిలయ్యదే..

గ్రామానికి మంజూరైన వైద్య కళాశాలను మల్లాపురంలోనే నెలకొల్పాలని కర్రె వెంకటయ్య చేపట్టిన నిరాహార దీక్షను భగ్నం చేసి ఆయనను అరెస్టు చేసి పోలీస్‌స్టేషకు తరలించారు. కర్రె వెంకటయ్యకు ఎలాంటి హాని జరిగినా ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య, సీఐ కొండల్‌రావు పూర్తి బాధ్యత వహించాలి. ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ఇంట్లో పనిచేసే గంధమల్ల రవి అనుమానాస్పద మృతిపై ప్రశ్నించిన బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కర్రె వెంకటయ్యపై ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య కక్ష సాధింపు చర్యలకు పాల్పడ్డాడు. ఈ ఉదంతం నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే పోలీసులను పెట్టించి కర్రె వెంకటయ్యను అరెస్టు చేసిన్నట్లుగా ఉంది. ఆయనతోపాటు 30 మంది బీఆర్ఎస్ నాయకులను అదుపులోకి తీసుకొని మండల పోలీస్‌స్టేషన్లకు తిప్పుతూ నానా ఇబ్బందులకు గురిచేస్తున్నారు. గతంలో యాదగిరిగుట్ట రూరల్ సీఐగా పనిచేసిన కొండల్‌రావు బీఆర్ఎస్ కార్యకర్తలపై ఇష్టారాజ్యంగా కేసులు పెట్టి ఇబ్బందులకు గురి చేశారు. గంధమల్ల రవి అనుమానాస్పద మృతిపై సోషల్ మీడియాలో వైరల్ చేస్తే కేసులు నమోదు చేస్తామని పోలీసులు భయభ్రాంతులకు గురిచేస్తున్నారు.

- మాజీ ప్రభుత్వ విప్ గొంగిడి సునీతా మహేందర్‌రెడ్డి


రాజాపేటలో రాస్తారోకో చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

### రాజాపేటలో రాస్తారోకో...

రాజాపేట, జూన్ 15: మల్లాపురంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కర్రె వెంకటయ్య చేస్తున్న దీక్షను పోలీసులు భగ్నం చేసి అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ ఆదివారం రాజాపేట మండలకేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శాంతియుతంగా నిరసన చేపడుతున్న వారిని అరెస్టు చేయడం అప్రజాస్వామికమన్నారు. కార్యక్రమంలో నాయకులు సట్టు తిరుమలేశ్, గుంటి మధుసూదన్‌రెడ్డి, సంధిల భాస్కర్ గౌడ్, ఎర్ర గోకుల జశ్వంత్, కాకాల ఉపేందర్, జనార్దన్ రెడ్డి, గోపిరెడ్డి, ఉప్పలయ్య గౌడ్, భాస్కర్ బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## అస్తవ్యస్తంగా వరద కాల్వ

### కంపచెట్లతో నిండిపోయిన కాల్వ కట్టలు

**పట్టించుకోని ప్రభుత్వం • చెరువులు నిండేదెలా అని రైతుల ఆందోళన**

> ప్రభుత్వ ఏఎమ్మార్పీ వరద కాల్వ అభివృద్ధికి నిధులు కేటాయించకపోవడంతో దీని పరిస్థితి అస్తవ్యస్తంగా మారింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండేండ్లు కావస్తున్నా మరమ్మతులకు నిధులు విడుదల చేయకపోవడంతో వరద కాల్వ పరిస్థితి ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా తయారైంది.

మిర్యాలగూడ, జూన్ 15: నాగార్జునసాగర్ ఎడమకాల్వ ఆయకట్టులో ఎత్తిపోతల పథకం ద్వారా చివరి భూములకు సాగునీరు అందించే లక్ష్యంతో ఏఎమ్మార్పీ వరద కాల్వను నాటి ప్రభుత్వం నిర్మించింది. ఈ కాల్వను 83 కిలోమీటర్ల పొడవులో నిర్మించారు. 81 ప్యాకేజీలో 27 డిస్ట్రిబ్యూటర్లు, 110 ప్యాకేజీలో 15 డిస్ట్రిబ్యూటర్లతో పాటు తూములను ఏర్పాటు చేశారు. ఈ కాల్వ ద్వారా పెద్దవూర, అనుముల, నిడమనూరు, త్రిపురారం, వేములపల్లి, తిప్పర్తి మండలాల పరిధిలో 20 చెరువులను నింపే విధంగా డిజైన్ చేశారు. నేరుగా కాల్వల ద్వారా 80 వేల ఎకరాలకు సాగునీరు అందుతుంది. నాగార్జునసాగర్ ప్రాజెక్టులో 575 అడుగులకుపైగా నీటి మట్టం రాగానే నేరుగా వరద కాల్వకు నీరు మళ్లించే విధంగా డిజైన్ చేశారు. ప్రాజెక్టులో 575 అడుగులలోపు నీరు ఉంటే పంప్‌హౌస్ ద్వారా నీరు ఎత్తిపోసి వరదకాల్వకు నీరు విడుదల చేస్తారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఎప్పటికప్పుడు నిధులు మంజూరు చేసి కాల్వలకు మరమ్మతులు చేయడంతో 80 చెరువుల నుంచి 80 వేల ఎకరాల విస్తీర్ణానికి సాగునీరు అందడంతో రైతులు ప్రయోజనం పొందారు. కాంగ్రెస్ ప్రభుత్వం మరమ్మతులకు నిధులు మంజూరు చేయకపోవడంతో గత ఏడాది వరద కాల్వకు పలు చోట్ల గండ్లు పడి పొలాలు దెబ్బతిన్నాయి.

### కంపచెట్లతో నిండిపోయిన వరద కాల్వ

వరద కాల్వకు రెండు వైపులా కంపచెట్లు పెరిగిపోయి రాకపోకలకు పూర్తిగా అంతరాయం ఏర్పడింది. కాల్వలో కంపచెట్లు కారణంతో వేములపల్లి, తిప్పర్తి మండలాల్లోని భూములకు, చెరువులకు నీరందక రైతులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. వరదకాల్వను నమ్ముకొని గత యాసంగిలో వరి పొలాలకు సాగునీరందక పంటలు ఎండిపోవడంతో మేకలు, గొర్రెలు, పశువులతో మేపేశారు. ఏఎమ్మార్పీ వరద కాల్వ ముందు భాగంలో పలు చోట్ల కాల్వ కట్టలు బలహీనంగా మారి గండ్లు పడ్డాయి. ప్రభుత్వం, అధికారుల నిర్లక్ష్యంతో కాల్వలకు ముందు భాగంలో ఏర్పడిన గండ్లను పూడ్చకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. తోపుచర్ల, కుక్కడం, పుచ్చకాయలగూడెం, గంద్రవానిగూడెం, మొల్కపట్నం, మంగాపురం, సల్కునూరు గ్రామాల పరిధిలో పలుచోట్ల పంటలు ఎండిపోయాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని స్థానిక రైతులు కోరుతున్నారు.


తోపుచర్ల సమీపంలో కంపచెట్లు, పూడికతో నిండిన వరదకాల్వ

### అధికారులను అడ్డుకున్న రైతులు



చిట్యాల, జూన్ 15: మండలంలోని వట్టిమర్తిలో ఉదయ సముద్రం కుడి కాలువ భూసేకరణ కోసం సర్వే చేయటానికి వచ్చిన అధికారులను రైతులు ఆదివారం అడ్డుకున్నారు. గతంలో భూమిని కోల్పోయే రైతులకు మార్కెట్ రేటు ప్రకారం నష్టపరిహారం ఇవ్వాలని ఆర్డీవోకు విజ్ఞప్తి చేసినా ఎలాంటి స్పందన లేదని, మళ్లీ ఎలా సర్వే చేస్తారంటూ రైతులు అధికారులను నిలదీశారు. ఈవిషయంపై గతంలోనూ రెవెన్యూ అధికారులు నోటీసులు ఇవ్వటంతో సంబంధిత రైతులు గతంలోనే ఆర్డీవోను కలిసి భూమికి మార్కెట్ రేటు ప్రకారం నష్టపరిహారం ఇప్పించాలని కోరారు. కానీ, దీనిపై ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన రాలేదని రైతులు ఆరోపించారు. వట్టిమర్తి చెరువు కింది నుంచి కాల్వ వెళ్తున్నందున లిఫ్టు ద్వారా చెరువు నింపాలన్నారు. అదనపు కలెక్టర్ గానీ, కలెక్టర్‌గానీ స్పష్టమైన హామీ ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో మోహన్ రెడ్డి, భిక్షంరెడ్డి, యాదగిరి, లవేందర్‌రెడ్డి, స్వామి, మల్లయ్య, యాదయ్య,వీరస్వామి, శ్రీకాంత్‌రెడ్డి, సత్తిరెడ్డి పాల్గొన్నారు.

## ఉన్నతస్థాయి విచారణ చేపట్టాలి

**బీఆర్ఎస్ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గొంగిడి మహేందర్‌రెడ్డి**


మాట్లాడుతున్న బీఆర్ఎస్ రైతువిభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గొంగిడి మహేందర్‌రెడ్డి

యాదగిరిగుట్ట, జూన్15: ఎమ్మెల్యే అయిలయ్య ఇంట్లో పనిచేసే గంధమల్ల రవి ఉరి వేసుకొని ఆత్మహత్య పాల్పడిన ఘటన పలు అనుమానాలకు తావిస్తోందని, ఈ ఘటనపై కమిషనరేట్ పరిధిలోని ఉన్నతాధికారితో విచారణ జరిపి వాస్తవాలను బయట పెట్టాలని ఎన్‌డీసీసీబీ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గొంగిడి మహేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక పోలీసులపై నమ్మకం లేదన్నారు. ఆదివారం పట్టణంలో మీడియా సమావేశంలో మాట్లాడారు. రాత్రి 9 గంటల మరణిస్తే పోలీసులు రాత్రికి రాత్రే పంచనామా చేసి, 11 గంటలకు భువనగిరి దవాఖానకు ఎందుకు తరలించారో అర్థం కావడం లేదన్నారు. వాస్తవానికి ఆత్మహత్య ఎమ్మెల్యే ఇంట్లోనే జరిగిందా? లేక హైదరాబాద్‌లోని మంత్రుల నివాసంలో జరిగిందా? ప్రజల్లో అనుమానాలు ఉన్నాయన్నారు. ఇలాంటి సమయంలో బాధ్యత గల ఎమ్మెల్యే వివరణ ఇవ్వాల్సి ఉంటుందన్నారు. రాచకొండ కమిషనర్‌కు వినతిపత్రం ఇచ్చేందుకు వెళితే.. ఆయన అందుబాటులో లేరని తెలిపారు. బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కర్రె వెంకటయ్య శాంతియుత వాతావరణంలో దీక్ష చేపడితే పోలీసులు అత్యుత్సాహాన్ని ప్రదర్శించి అరెస్టు చేయడం సరైందికాదన్నారు. రవి ఆత్మహత్య ఘటనను పక్కదారి పట్టించేందుకే వెంకటయ్యను అరెస్టు చేయించి నానా హంగామా సృష్టించారన్నారు. ఎమ్మెల్యే, పోలీసుల దౌర్జన్యాలపై నియోజకవర్గ వ్యాప్తంగా త్వరలో ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తామన్నారు. కేటీఆర్, హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డితోపాటు మాజీ ఎమ్మెల్యేలను సంప్రదించి బంద్‌కు సిద్ధంకానున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో రవీందర్‌గౌడ్, ప్రవీణ్‌రెడ్డి, విజయ్, రాజశేఖర్, సతీశ్ గౌడ్, మనోజు కుమార్, శ్రవణ్, రాజేశ్ యాదవ్, వీరారెడ్డి పాల్గొన్నారు.